# తూర్పు వెళ్లని రైలు

"బత్తేల బండికింకా ఎంతటైముంది బాబూ?" అంటూ ఆదరాబాదరాగా ఒగర్చుకుంటూ స్టేషనులోకి అడుగు పెట్టింది ఓ ముసిల్ది.

ఎవరూ దాన్ని పట్టించుకోలేదు.

విసుక్కుంటూ, మళ్లీ ఒకరిద్దర్ని వాకబు చేసింది.

లైనుక్లియరు గంట కొట్టలేదని తెలుసుకుని స్తిమితపడింది.

అప్పుడింక తాపీగా, సగం తాగి ఆర్పేసిన చుట్ట తీసింది. అటూ యిటూ చూసి, ఎవర్నో బ్రతిమిలాడి అగ్గిపెట్టె తీసుకుని చుట్ట ముట్టించుకుంది. గుప్ గుప్‌న పొగ పీల్చి, అది బాగా ఎర్రగా కాలేక అడ్డపొగ పెట్టుకుంది.

ముసిల్దానికి అరవయ్యేళ్లు దాటివుంటాయి. జుత్తంతా తెల్లబడిపోయింది. ముఖంమీద చర్మాన్ని లాగేసినట్టుగా ముడతలు. మాసిన ముతకగళ్లచీర కచ్చపోసి అడ్డకట్టుకట్టింది. రవికె వేసుకోలేదు. చేతికి మట్టిగాజులు. మెడలో పసుపుతాడు. ముఖాన రూపాయి బిళ్లంత కుంకుమబొట్టు. కాళ్లకి యింత మందాన ఇత్తడి కడియాలు. చెవికమ్మల బరువుకి సాగిపోయిన చెవులు, తోలుబద్దల్లా వేలాడుతున్నాయి. ముక్కున అడ్డబాస.

ఆత్రుతని అణచుకోలేక రైలురాక కోసం చూస్తోంది. దాని చూపు కనీసం ఫ్లాట్‌ఫారం ఆ కొసవరకూ కూడా ఆనడం లేదు. విసుక్కుంటూ తనలోనే ఏదో గొణుక్కుంటోంది.

"బత్తేల బండి యింకా ఎంత సేటువుద్ది బాబూ" అని మళ్లీ ఎవర్నో అడిగింది. అక్కడివాళ్లకది మామూలే. ఆ రైలు వొచ్చేవరకూ అదలా అడుగుతూనే ఉంటుంది. దాని మాటలు వారికి వాగుడుగానూ, దాని ఆందోళన వాళ్లకి నస పెడుతున్నట్టుగానూ అనిపిస్తూ ఉంటుంది. జవాబూ చెప్తే చెప్తారు. లేకపోతే లేదు.

"వొచ్చేస్తాది, ఇంకో సిటువో, సెణవో" ఏకళనున్నాడో, జవాబిచ్చేడతను.

దాంతో తృప్తిపడి, ముసిల్ది మరి మాట్లాడలేదు. చుట్ట తాగూతూ రాబోయే రైలుబండి కోసం ఎదురు చూస్తూ కూచుంది. దాని నిరీక్షణ బత్తేలబండిలో వచ్చే ముసలయ్యకోసం. వాడు తెచ్చే సరుకుల కోసం. వాటిని అమ్మితే వచ్చే పూటబత్తెం కోసం.

* * *

ఆ ఫ్లాట్‌ఫారం అంచుమీద నిలబడి తూర్పువేపు చూస్తే రైల్పుబద్దీలు రెండూ కనుచూపుమేర తిన్నగా సాగి, అంతకు అల్లంత దూరంలో చింతలతోపు దగ్గర అదృశ్యమైపోతాయి. అక్కడ రైల్వేలైను పెద్ద మలుపు

జరుగుతుంది. వచ్చే రైలు ఆ మలుపు తిరిగేవరకూ కనిపించదు. వెళ్లేరైలు మలుపు తిరుగుతూనే చింత తోపులో దట్టమయిన చెట్లనడుమ మాయమైపోతుంది. రైలుకోసం పడిగాపులు పడే ప్రయాణీకులు సాధారణంగా తమ దృష్టిని అక్కడే నిలిపి చూస్తూ ఉంటారు.

సాయంత్రం ఆరు కావస్తోంది. స్టేషనుకవతల చెరువుకట్టుమీద నుంచి వచ్చే శీతగాలి శరీరాన్ని గిలిపెడుతోంది. దూరాన కనిపించే కొండలు మంచు దుప్పట్లు కప్పుకుని కదలకుండా ఉన్నాయి. చింతలతోపు చీకటిముద్దలా కనిపిస్తోంది. ఆ సింగల్ బ్రేక్‌కి అవతల టెలిఫోను తీగెలమీద ఏవో పక్షులు బారులుతీరి రొదచేస్తున్నాయి.

నాలుగింటికి రావల్సినరైలింకా రాలేదు. ఆరైలు వస్తే స్టేషను బద్ధకం వదిలిపెట్టి, వొళ్లు విరుచుకుని నిద్ర లేచినట్టుగా, కాసేపు కళకళలాడుతుంది. ఆ సందడి కాసేపే. మళ్లీ అర్థరాత్రి దాటేక గానీ ఆ లైన్లో రైలు లేదు. నిశవేళ వొచ్చే పాసింజరు కోసం జనం వుండరు కనుక స్టేషను మత్తుగా జోగుతున్నట్టుగా నిశ్శబ్దంగా ఉంటుందప్పుడు. మస్తానయ్య కొట్టే గంట చప్పుడు, దిగుడు బావిలోంచి వినిపించినట్లుగా గార్డు వేసే విజిలు, నిద్రమత్తుతో, బొంగురుగొంతుకలతో వినిపించే ఒకటీ అరా మాటలు రైలు కూతవేసి బయలుదేరేటప్పుడు చేసే శబ్దంతో మిళితమయిపోతాయి. అంచేత, ఆ చిన్న స్టేషన్లో సందడి ఉండేది యిప్పుడు రాబోయేరైలుకే బత్తేలబండి వేళప్పుడే-

దాని రాకపోకలకి సరైన వేళాపాళా అంటూ ఉండదు. అందువల్ల తొందర పనులున్న వాళ్లూ, డబ్బున్నవాళ్లూ ఆ పాసింజరు ఎక్కడం ఎప్పుడో మానేసారు. ఆ లైన్లో ఒకటి రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లున్నా, అవి ఆ గ్రామంలో ఆగవు. కనుక వాళ్లు బస్సులమీదే ఆధారపడతారు. ఇకపోతే, బీదా బిక్కీ, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వాళ్లు దానికోసం కనిపెట్టుకుని కూచుంటారు. ఒక విధంగా చెప్పాలంటే చిన్నా చితుకూ వ్యాపారాలు చేసుకునేవాళ్లకి ఆ పాసింజరు ట్రయినే జీవనాధారం.

ఒరిస్సా, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్న చిన్న గ్రామం అది. కోస్తా ప్రాంతంలో ఆంధ్రాకి చెందిన ఆఖరి గ్రామం కూడా అదే.

ఉదయాన్నే ఒరిస్సావేపు వెళ్లే పాసింజరుబండిలో ఆడామగ చిన్నా పెద్దా భేదం లేకుండా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ పొట్టపోసుకునేవాళ్లు బయలుదేరి వెళ్లిపోతారు. ఒరిస్సా సరిహద్దు గ్రామాల్లో చవగ్గా దొరికే వస్తువుల్ని కొనుక్కుని, మళ్లీ సాయంత్రం బండిలో ఆ గ్రామానికి తిరిగి చేరుకుంటారు. సాధారణంగా అక్కడి నుండి వాళ్లు తెచ్చేవి కర్రలముట్టెలు, బొగ్గుల బస్తాలు, ఐదు, పది కేజీలుండే చిన్న చిన్న బియ్యపు సంచులు సీజన్లో అయితే చింతపండు లాంటి అడవిదినుసులు. ఎవరూ టిక్కెట్లు కొనుక్కోరు. ఎవరికి ముట్టవలసిన డబ్బు వారికి ముట్టచెప్తూనే ఉంటారు కనుక వాళ్లదగ్గర టిక్కెట్లు లేకపోయినా, వాళ్లు అక్రమంగా సరుకులు రవాణా చేస్తున్నా, ఎవరూ పట్టించుకోరు.

రైలు చింతలతోపులో ఉన్నప్పుడే, అప్పుడింక మొదలవుతుంది కోలాహలం.

రైలు ఆ చెట్లమధ్యనుండి వొస్తున్నప్పుడు స్టేషను దగ్గరనుంచి చూస్తే, చింతలతోపు మీద ఆకాశంలో దట్టమయిన కరిమబ్బుల్లాగా ఆ బొగ్గు యింజను వదిలే నల్లనిపొగ ముందుగా కనిపిస్తుంది. అప్పుడు చింతలతోపు నల్లని బొచ్చుటోపీ పెట్టుకున్నట్టుంటుంది. ఆ తర్వాత మరోరెండు క్షణాలకే రైలు చప్పుడు దూరం నుంచి సన్నగా వినిపించడం ఇంతలోనే రైలింజను కనిపించడం జరుగుతుంది. అది కనిపించడంతోటే

మస్తానయ్య సైటుబెల్లుగణగణమంటూ కొడతాడు. ఆ చప్పుడు ఇంకా రింగుమని వినిపిస్తూండగానే బత్తేలబండి గర్భిణీస్త్రీలాగా నెమ్మదిగా ఫ్లాట్‌ఫారంమీద వొచ్చి ఆగుతుంది.

అప్పుడిక మొదలవుతుంది సందడి! సరుకులు దిగగానే మధ్యదళారీలు వాళ్లని ఈగల్లా ముసురుకుంటారు. సరుకులు తెచ్చే తమవాళ్ళకోసం స్టేషనుకొచ్చిన జనం- వాళ్లని వెతుకుంటూ అటూ యిటూ పరిగెడుతూ ఉంటారు. కొంతమందయితే రైలు, స్టేషనులోకి రాకుండానే, ఫ్లాట్‌ఫారంలోకి ప్రవేశించకముందే తాము తెచ్చిన మూటల్ని రైల్లోంచి బయటకి విసిరేస్తూ ఉంటారు. వాటికోసం కాపలా కాచుకుని ఉండేవాళ్ల మనుషులు గబగబ వాటిని పోగుచేసుకుని, ఎవరికీ చిక్కకుండా ఆ పొలాలంట అడ్డంపడి ఊర్లోకి పరుగులు తీస్తుంటారు. ఇది గమనించి అరుస్తూ వాళ్లవెంటబడే మారువర్తకులూ, రైల్వేస్టేషను మనుషుల కేకలూ రైలొచ్చేవేళకి టంచనుగా వచ్చేసి తమ పోలీసు మామూళ్ల వసూలు చేసుకుపోయే పోలీసు కానిస్టేబులు జబర్దస్తీ అరుపులు, దళారీల బేరసారాలూ - వీటితో ఆ కాసేపు అక్కడ సందడి జాస్తీగానే ఉంటుంది. అసలు, దళారీలు ముందుగానే బయానాలు యివ్వడం, సరుకులు తేడానికి మదుపులు పెట్టడం, చాలా బేరాలు రైలు రాకముందే పూర్తయిపోయి ఎవరిసరుకు ఎవరికి అమ్మాలో కూడా నిర్ణయమైపోతూ ఉంటుంది. తెచ్చిన సరుకుల్ని అయినకాడికి అక్కడే చెల్లుబడి చేసుకుని, వచ్చిన డబ్బులు పట్టుకుని కొంపలకెళ్తారు. అలా వచ్చే పదో పరకో తెస్తేనే కొంపల్లో పొయ్యి రాజుకునేది.

సాధారణంగా ఈ వ్యాపారానికి అడ్డంకులు ఏర్పడవు. మహా అయితే మస్తానయ్య ఇచ్చింది చాలదని గునుస్తాడు. ముసలి స్టేషనుమాష్టరూ, ఇతర రైల్వే ఉద్యోగులూ వాళ్ల డబ్బులు వాళ్లకి పడటంవల్ల పట్టించుకోరు. లోకల్ పోలీసుల వాటాసంగతి సరేసరి. అందరి మామూళ్లూ పోయి దక్కిందే చాలనుకొని, వాళ్లు కొంపలకి పోయి గంజినీళ్లతో కడుపునింపుకుంటారు. బేరాలు బాగున్నరోజున సెత్తళ్ల చారో, చేపల పులుసో వండుకోగలిగితే అదే వారికి పండుగ.

ఇలా, అక్కడ చాలామందికి ఆ పాసింజరు రైలు వస్తేనే యింట్లోకి దొరకేది. అందుకే అంతా దాన్ని 'బత్తేలబండి' అని పిలుస్తూ ఉంటారు.

అందరితోపాటు ఆ సాయంత్రంవేళ- చిరుచిరు చలిగాలులకి సన్నగా వణుకుతూ, ముసిల్ది కూడా ఆత్రంగా బత్తేలబండి కోసం ఎదురుచూపులు చూస్తోంది.

రైలు 'ఇంకో సిటంలోనో, సెణంలోనో వస్తాదని' చెప్పిన మనిషి మరియువేపు రాలేదు. రైలు వచ్చే జాడ కూడా లేదు.

ముసిల్దానిలో కంగారు రానురాను ఎక్కువయిపోతోంది. ఉదయం బండిలో సరుకులకోసం వెళ్లిన భర్తగురించే దాని ఆందోళన అంతా.

ఉదయం బండిలో వెళ్లాడు భర్త. రాత్రి చేసిన కుడుంముక్క సిల్వారు డబ్బాలో పెట్టుకుని పట్టుకెళ్ళాడు. అదితిని, ఏ టీనీళ్లో తాగి కడుపునింపుకోవాలి. వాడికి వొంట్లో సత్తువ లేదు. దెబ్బయ్యేళ్లుండాయేమో. పైగా ఉబ్బసం వొకటి. ఈ రొజ్జగాలి వాడికసలు పడదు. భర్త గూర్చిన ఆలోచనల్తో ముసిల్దాని ప్రాణం జిలార్చుకుపోతోంది. ఆ పూటకాముద్ద దొరకాలంటే వాడికా తాపత్రయం తప్పదుమరి! లేకపోతే పస్తే-

ముసిల్దానికి ఓర్పు తగ్గిపోతోంది. రైలుకోసం ఎదురు చూసి చూసీ విసుగెత్తిపోతోంది. వెచ్చటి

[illegible]లో పోయి ఉంటే బాగుందనిపించింది. అంతకష్టం మీద ఆ కోరిక అణుచుకుంది.

ఇంతలో స్టేషన్లో కలకలం మొదలయింది. ముసిల్ది చూపు చికిలించి చూసింది. వాళ్లే- మూరుబేరగాళ్ల వాళ్లొచ్చేసేరంటే రైలొచ్చే టైమయిందన్న మాట!

ఎలా తెలుసుకుంటారో, సరిగ్గా రైలింకో పావుగంటలో వస్తుందనగా బిలబిలాడుతూ దిగుతారు. మరి కాస్సేపట్లో పోలీసుజవాను కూడా జర్దాకిళ్లీ బుగ్గన బిగించి, చేతిలో చార్మినార్ సిగరెట్టుతో స్టేషనుకి దిగబడతాడు. బేరాలు మొదలవుతాయి. బయానాలిచ్చు కోడాలు 'నివాడా' లెక్కలు సరిచూసుకోడాలు ప్రారంభమవుతాయి.

ముసిల్ది కూచున్న చోటునుంచి లేచి వాళ్లవేపు వెళ్లింది. దానిదృష్టి అక్కడ, వాళ్లమధ్య మాట్లాడుతూ నిలబడిన రాజమ్మమీద పడింది. 'పింజారీముండ, అప్పుడే లెడీ అయిపోనాది' అక్కసుగా మనసులో అనుకుంది ముసిల్ది. రాజమ్మ మొగుడు లైనుకెళ్లి సరుకులు బాగానే తెస్తాడు. రాజమ్మ తన మాటకారితనంతో కొంచెం మంచిధరకే వాటిని అమ్ముతూ ఉంటుంది. మంచి పరువంలో వుందది.. నిగనిగలాడే నల్లని వొళ్లూ, వంకీల జుత్తు, పిటపిటలాడే రవిక, చురుగ్గా చూసే పెద్ద పెద్ద కళ్లూ- రాజమ్మ చొరవ అక్కడి మగాళ్లకి మరింత ఆకర్షణ కలిగిస్తూ ఉంటుంది. వసపిట్టలా వాగుతూ ఉంటుంది. వాళ్లూ వీళ్లు అనక అందరితోనూ హాస్యాలాడుతూ ఉంటుంది. వేళాకోళం చేస్తూ ఉంటుంది. ముసిల్ది కనిపిస్తే చాలు మరీనూ. అందుకే ముసిల్దానికి రాజమ్మంటే పడదు. పెట్టుబడికి డబ్బు, వంట్లోకి శక్తీ రెండూ లేకపోవడంవల్ల ముసలయ్య పూర్వంలా సరుకులు తేలేకపోతున్నాడు. డబ్బులేక, నాసిరకం సరుకులు తెస్తుండడంవల్ల అవి అమ్ముకునే సరికి ప్రాణం కడతేర్చుకుపోతోంది ముసిల్దానికి. రాజమ్మ వ్యాపారం జోరుగా సాగుతూ ఉండడం కూడా ముసిల్దానికి రాజమ్మ అంటే పడకపోవడానికి కారణం.

రాజమ్మ దృష్టి ముసిల్దానిమీద పడనేపడింది "ముసిలాడు ఇయ్యేల లైనుకెళ్లేడేటోలమ్మ?" అని అడిగింది.

వగలు కురుస్తూ ఆ అడిగిన తీరుకి చిర్రెత్తుకొచ్చింది ముసిల్దానికి. జవాబు చెప్పలేదు. "మాతో మాట్టాడకూడదేటి? నోరిప్పితే రతనాలు జలజల్రాలి పోతయ్యని బయ్యవేటి?"

ముసిల్ది మరి ఓర్చుకోలేకపోయింది. "ముసిలోడి వూసు నీకేల? నీ యేపారం నువ్వు సూసుకో" అంది చిరాగ్గా.

"అబ్బోసి, ముసిల్దాయికి పౌరుసం పొడుచుకొచ్చేసినాది. ఇంతకీ ఆడేటి తెస్తాడు? బియ్యం మూటలట్టుకొస్తాడు గావాల్ను" ముసిల్దాన్ని అకారణంగా రెచ్చగొట్టడం రాజమ్మకి సరదా.

"బియ్యం మూటలే తెస్తాడో, బెల్లం దిమ్మలే తెస్తాడో నీ వయసులో నీపాటి యేపారం కావూసేసాంనేయే! వూరికే తుళ్లిపోకు నువ్వేటి మమ్మల్ని పెంచుతున్నావా, పోసనాకారం సేస్తున్నావా? వల్లకో, వల్లకో" అంటూ రాజమ్మని కసిరింది ముసిల్ది.

చుట్టూ ఉన్నవాళ్లు రాజమ్మ మాటలు వింటూ నవ్వుతూ వినోదం చూస్తున్నారే కాని దాన్ని వారించలేదు.

"ముసిలోడికి డబ్బుయావ కాకపోతే, ఆడెందుకు సెప్పు లైనుకెళ్లడం" అన్నాడొకడు.

''రేఁడు రైల్లో టీసీలకి మామూలిచ్చే సోట గోకిగోకి బేరాలాడ్తాడు. యివ్వనానికీ పైసలుండవ్. గాంప్లైసు యాపారానికి మాత్రం దొరబాబునాగా తయారైపోతాడు. సీ! సీ! ఈ ముసిలోడివల్ల బిజినెస్సు సేసుకునే మనపింటోల్లకి మాటొస్తోంది'' అని చీదరించుకున్నాడింకొకడు. ముసిల్దానికి మనసు మండిపోయింది.

'మా కాడ డబ్బు, మా వొంట్లో సత్తువా వున్నప్పుడు నీకన్నా మంచి బిజినెస్సే సేసేవోల్లంరా లక్క పిడత ముకం ఎదవా' కసిగా అనుకుంది తనలో. పైకి అనలేదు.

వాళ్లతో తగూపెట్టుక్కూచుంటే జరగదు తనకి. టీకొట్టు సాంబయ్య కాళ్లావేళ్లాపడి వాడినో పదిహేను రూపాయలు అప్పడిగి తీసికెళ్లాడు ముసలయ్య. కర్రల ముట్టెలు తెస్తానన్నాడు. దళారీల్లో కర్రలఅడితీ మనుషులకోసం వెదకాలి. బేరం ఇక్కడే సెటిలయిపోవాలి. కర్రల ముట్టెలు మోసుకుని ఊర్లోకెళ్లడవూ కష్టమే. చెకగేటువాళ్ల బారినుంచి వాటిని కాపాడుకోవడమూ కష్టమే. అందుకే అయినకాడికి వాటినిక్కడే అమ్మెయ్యాలి.

ముసిల్ది ఆ మనిషికోసం వెతుకుతూ ఉండే కర్రల అడితీ గుమస్తా గురవయ్య కనిపించేడు. ముసిల్దానికి ప్రాణం లేచొచ్చినట్టయింది. గబగబ అతనిదగ్గరకెళ్లింది.

''బాబూ, గురవయ్యబాబూ, మా యజమాని కర్రలముట్టెలు తెస్తాడియ్యేల'' అంది అతనితో.

''తీసుకురానీ చూద్దాం'' అన్నాడతను ఉదాసీనంగా. ముసిల్ది కంగారు పడిపోయింది.

''బండిదిగ్గానే నీకాడకొస్తాం నాయనా, నువ్వే కొనాలి''.

అతను ముసిల్దానివేపు ఎగాదిగా చూసేడు.

''మా తండ్రి - కాదనకు నాయన'' అంది అర్థిస్తున్నట్లుగా.

''వాడేం తేగలడే ముసిలమ్మా - తెచ్చినా, మీతో బిజినెస్సు మేం చెయ్యలేం - మహా కాని పేచీకోరు మనుషులు మీరు'' తెగేసి చెప్పేడతను నిక్కచ్చిగా.

ముసిల్ది ముఖం గంటుపెట్టుకుంది. అతనక్కడి నుండి కదిలి వెళ్లిపోబోయేడు. ముసిల్ది అతని వెంటబడింది.

''అదేటి తండ్రీ అలాగంటావు? నీతో మావెప్పుడేనా తగువాడేవేంటి? నువ్వెంత సెప్తే అంత. ఎంత సెక్కగట్టి యిస్తే అంత. కాదంటామేటి?'' అంది దేబిరిస్తున్నట్టుగా.

''సరే బండిరానీ, చూద్దాం'' అన్నాడతను.

అలా నిర్లిప్తంగా మాట్లాడ్డంలో ఉండే వ్యాపారపు మెళుకువలు అతనికి బాగా తెలుసు మరి!

ఆ పాటి మాటకే ముసిల్ది తృప్తిపడి నిట్టూర్చింది. ఇంతలో స్టేషన్లో హడావిడి మొదలయింది.

మస్తానయ్య సైటుబెల్లు గణగణలాడించేడు. రైలు భారంగా వొగురుస్తున్నట్టుగా పెద్దశబ్దం చేస్తూ స్టేషన్లోకి వచ్చి ఆగింది.

ప్లాట్‌ఫారం మీద ఉరుకులూ పరుగులూ మొదలయ్యేయి.

ముసిల్దాని కళ్లు ఆత్రంగా భర్తకోసం వెదకసాగేయి.

రోజూరైలు నెమ్మదిగా ఆగుతూ ఉండగానే, కంపార్టుమెంటులోంచే భార్యని పిలవడం ముసలయ్య అలవాటు. ఆ గొంతువిని అటువేపు వడివడిగా వెళ్లి, సరుకులు దించడంలో భర్తకి సాయం చేస్తుందామె.

ఇవాళ రైలొచ్చి ఆగడం పూర్తయినా ముసలయ్య గొంతు ఎక్కడా వినిపించలేదు. ముసిల్ది కంగారుగా దిక్కులు చూడసాగింది. ఆ గోలలో ముసలయ్యగొంతు కలిసిపోయి వినిపించలేదేమో అనే అనుమానం వచ్చింది దానికి. దాని మనసు ఆందోళనతో బరువెక్కిపోయింది. శరీరంలో సన్నని జలదరింపు మొదలయింది. తడారిపోతూన్న గొంతు పెగుల్చుకుని భర్తని పిలుస్తూ జనాన్ని తప్పించుకుని వెతకసాగింది.

ఎక్కడా ముసలయ్యజాడ లేదు!

ముసిల్దాని గుండె లబలబలాడిపోయింది.

కళ్లలో నీళ్లు తిరిగి, దుఃఖం తన్నుకొస్తోంది.

బండి దిగిన వాళ్లలో తెలిసిన వాడొకడు అటువేపు వస్తుంటే వాడిని ఆపి భర్తగురించి వాకబు చేసింది.

వాడు, వాడితొందరలో జవాబు చెప్పకుండా ముందుకి పోబోయేడు. కాని ముసిల్ది వాడ్ని వొదలలేదు.

దాంతో వాడు ముసిల్దానివేపు ఎగాదిగా చూసి చెప్పేడు. ''ఆడా! ఆడు టీసీగోరికి మామూలియ్యడానికి డబ్బులు మిగల్నేదని సెప్తే ఆ బాబు ముసిలోడ్ని ముందల టేసన్లో బండి నుంచి దించీసినారు'' అని చెప్పి, గబగబా వెళ్లిపోయేడు.

అదివిని ముసిల్దానికి గుండె చిద్రుపలు చిద్రుపలైనట్టయింది. నేలలోకి కూరుకుపోతున్నట్టనిపించింది. ప్రాణం కడతేర్చుకు పోతున్నట్టయింది. గొల్లుమంటూ ఏడవడం మొదలుపెట్టింది.

''ఓర్నాయనో, డబ్బులు సాల్లేదు కావాల్న ఆడుటిక్కెట్టు కట్టనేదని బండి దించీసినారా! ఈ రేత్రికి ఆడక్కడ ఏటైపోతాడ్రా నాయనో... పెందిలకాడ్నుంచి ఆడికి తిండీ తిప్పలు కూడా నేవు.. సీకట్లో ఎందలబడి పోతాడు బాబోయ్..'' అంటూ పెడబొబ్బలు పెట్టసాగింది. ఒకరిద్దరు తెలిసినవాళ్లు దాని కేకలకి అటువేపొచ్చేరు. వాళ్లని చూసి దానికి దుఃఖం, కోపం మరింత అధికమయ్యేయి. ''ఆడికాడ డబ్బులు సాల్నేదోయేటో తెలిసిన ముకాలు, మీరింతమందున్నారు- ఆడ్ని ఆ బాబు బండి దించేత్తుంటే మీరంతా సిత్రాలు సూస్తూ వుండిపోయేరేట్రా ఎదవల్లారా'' అరిచినట్టుగా అడిగింది వాళ్లని.

ముసిల్ది మరి దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. ఏడుస్తూ ఇంజనువేపు పరిగెత్తింది. దానిమనసు కల్లోలిత సముద్రంలా ఉంది. దానికి అప్పుడా రైలు పెనుపిశాచంలాగానూ, హడావిడిగా తిరిగే ఆ జనం కఠిన పాషాణాల్లాగానూ తోచేరు. ఏడుస్తూ ఇంజనుదగ్గరకి చేరింది.

సెగలూ పొగలూ కక్కుతున్న రైలింజను పాపాల పుట్టలా ఉంది. పగిలిన అగ్నిపర్వతంలా ఉంది. మృత్యువుకి ముఖద్వారంలాగానూ ఉంది.

క్షణంలో సగంసేపు ఏం ఆలోచించుకుందో, గబగబా రైలింజను దాటుకుని వెళ్లి, గభాలున

ప్లాట్‌ఫారం ఎగి ఇంజను ముందు రైలుపట్టాల మధ్య పడిపోయింది.

అప్పుడింక పిచ్చిపట్టిన దానిలా పెద్దిగా ఏడుస్తూ, బిగ్గరగా అరవడం మొదలుపెట్టింది. ఇంజను డ్రైవరు తప్ప ఆ హడావిడిలో మొదట అదెవరూ గమనించలేకపోయేరు. డ్రైవరు బిత్తరపోతూ ఇంజన్‌లో నుంచి ఫ్లాట్‌ఫారంమీదకి గాభరాగా దిగేడు. జనం ఒకరూ ఒకరూ పోగయ్యేరు.

ముసిల్ది శోకాలు పెడుతూ అందర్నీ తిట్టసాగింది. ''నానీబండిని కదల్నియ్యను... నా మొగుడ్ని బండిలోంచి ఎనకటేసన్లో ఎందుకుదించీసినారో ముంగల సెప్పాల నాకు.. ఈ గోరం ఎందుకు సేసేరో సెప్పాల'' అంటూ గొడవ చేయసాగింది. ఈ గొడవ ఆనోటా యినోటా తెలిసి బండిలోని టీసీలూ, గార్డూ, స్టేషన్లోని ఉద్యోగులూ అంతా గాభరాగా అక్కడికి చేరారు. ముసిల్దాని వ్యవహారం చూసి విస్తుపోయేరు. వాళ్లంతా రావడంతో మరింత రెచ్చిపోయింది ముసిల్ది.

దాని ఏడుపు నానా భీభత్సంగానూ ఉంది. ఆవేశంతో ఊగిపోతోంది. పైటజారిపోయి, అచ్ఛాదన లేని దాని గుండెలమీద ఎండిపోయిన రొమ్ములు ఉద్వేగంతో ఎగిసిపడుతున్నాయి. భయంతో, దుఃఖంతో దాని ముఖం వికృతంగా వుంది. దానిగొంతులో అంతులేని విషాదం బొంగురుపోయి గరగరలాడుతోంది.

'నాన్సెన్స్- ఏమిటీగొడవ' అంటూ విసుక్కున్నాడొక టీసీ. దాని మొగుడ్ని ముందుస్టేషన్లో దించేయడమే అది చేస్తున్న యీ రభసకి కారణమని తెలిసేక మరింత మండిపడిపోతూ అన్నాడు. ''వాడిదగ్గర టిక్కెట్టు లేదు. అక్రమంగా సరుకు తీసుకొస్తున్నాడు. అందుకని వాడ్నిదించేసాం దానికింత అల్లరి చేస్తావేం? పోలీసులకప్పగిస్తాం జాగ్రత్త'' అని బెదిరించేడు.

ముసిల్ది చలించలేదు. ఆ మాటలన్న టిక్కెట్ కలెక్టర్‌వైపు నిర్లక్ష్యంగా చూసి అరుస్తూ అంది. ''ఏటీ? నా మొగుడు టిక్కెట్టు కట్టనేదనా దించీసినావు? ఈ బత్తేలబండి అసలు నిబ్బగ టిక్కెట్టు కట్టి తిరిగేవోళ్లెవలో సెప్పు సూద్దాం? ఆళ్లందర్నీ బండి దించేస్తున్నారేటి?

ఆ మాటలతో టీసీకి కోపం పొంగుకొచ్చింది.

''నోర్ముయ్ రాస్కెల్. మాకు మా డ్యూటీ గురించి నువ్వు చెప్పక్కరేలదు... రూల్సు ప్రకారం అసలు వాడ్ని జైల్లో తోయించీవాలి. ముసలాడని దయదలచి ఆ స్టేషన్లో వదిలేసేం... సంతోషించు'' అన్నాడు కోపంగా. .

ముసిల్ది తిక్కరేగి మరింత రెచ్చిపోయింది.

''మీ రూల్సు నాకాడ సెప్పక బాబు.. మీ జేబీలు నిండితే రూల్సాగిల్సా ఏటీసేవు - అవి మమ్మల్నేటి సెయ్యవ్.. ఇంతకాలం మీ జేబీలునింపనేదా? ఇయ్యేల ఆడికాడ డబ్బులు సాలక పోయుండాల.. ఆడు మీ మామూలు యిచ్చుకోనేదని ముసిలోడని కూడ సూడకండ బండి దించీసినారు.. ఏటిబాబూ మేం సేసీది దొంగయేపారవా! నిజవే, కాదన్ను. మేం సేసేదీ, సేత్తున్నదీ దొంగయేపారవే. టిక్కట్లు కట్టకండ మీకు డబ్బులిచ్చేసి బండిల ప్రెయాణాలు సెయ్యడం కూడా నేరవే కాదన్ను కాని మా సరుకులు కొనుక్కుపోయి పెద్ద యేపారాలు సేసేవోళ్లని మీరేటిసెయ్యరు. సెయ్యనేరు. ఈ అన్నేయాన్ని, అదర్మాన్ని పెంచి పోసాకారం సేస్తున్నది ఎవులు? మీరు కాదూ? పోలీసుల్ని పిలుస్తావ్? పిలు బాబూ అల్లద, అక్కడ ఆడి మామూలు కోసం దేవులాడుకుంతన్నాడు...''

"దాన్నలాగే యివతలికి పారెయ్యండి" ఉద్రేకం ఆపుకోలేక అన్నాడో అధికారి.

"నాను లెగను.. లెగనుగాక లెగను. ముసిలోడ్ని కనికారం నేకండ సీకటి కొగ్గేసినారు.. నా మొగుడ్ని నాకు తెచ్చివ్వండి.. సీకట్లో ఆడిక్కడికి నడుసుని వచ్చేస్తుంటాడు. దార్ల ఆడ్నేదేనా బంటి బక్రెత్తి దిక్కేటి? ఆడు సేమంగా వొచ్చీదాక కదల్నంతే.." అని మరింత మొండికేసి రైలు పట్టాల కడ్డంగా పడుకుండిపోయింది ముసిల్ది. ఎవరికీ ఏం చెయ్యాలో తోచలేదు.

"ఇదిగో ముసలమ్మా, నువ్విలా గొడవసెయ్య మాక... ముసిలాడు సేమంగా తిరిగొస్తాడు, మాది పూచీ" అంటూ తెలిసిన వాళ్లు నచ్చచెప్పబోయేరు.

ముసిల్ది వాళ్లమీదకి విరుచుకు పడింది.

"ఛీ.. సెత్కారీ నెమ్డీ కొడుకుల్లారా! మీరూ మనుషులేనట్రా? ఆడూ మీతోబాటే యేపారం సేసుకుంటున్నాడు. మొకం మొకం ఎరిగినోల్లం... ఆడ్ని బండిదించేస్తుంటే ఒగ్గీసెలా గొచ్చీసినార్రా... ఇలపింటోళ్లు, మీరు నాకు బోదసేసీపాటి వోల్లయిపోనారట్రా, ఛూ!" అంటూ కాండ్రించి ఉమ్మేసింది.

ముసిల్దాని ఛీత్కారాలని వాళ్లు మరింక భరించలేకపోయేరు. అది చేస్తున్న యాగీని చూస్తూ సహించలేకపోయేరు. దాన్నలా వాగనిస్తే ఎంతసేపయినా వాగుతూనే ఉంటుంది. బండి బయల్దేరే టయమయిపోతోంది. మరిదాన్ని వాళ్లు ఉపేక్షచేయలేక పోయేరు. ఆ సరికే అక్కడికొచ్చి దాని గొడవ చూస్తూ నిలబడిపోయిన పోలీసు కానిస్టేబులికి చప్పున తన కర్తవ్యం గుర్తుకొచ్చింది.

ముసిల్దాన్ని బూతులు తిడుతూ, దాని జబ్బ పట్టుకుని బలవంతంగా లాగి రైల్వేలైనుకి యిటువేపు పడేసాడు. ఆ విసురుకి ముసిల్ది అల్లంతదూరంలోకెళ్లి కుప్పలా పడిపోయింది.

ఆ ముదివగ్గు వొంట్లో బలహీనపు ఎముకలు బాధతో కరకరలాడేయి.

మరింక లేవడానికీ, ఏడవడానికీ కూడా శక్తి చాలక, ముసిల్ది అందరికీ శాపనార్థాలు పెడుతూ ఉండిపోయింది.

అంతా తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నారు.

దాని గొడవ తొందర్లోనే చల్లారినందుకు, అందరి ముఖాల్లోనూ సంతోషం కనబడింది.

తన డ్యూటీ సక్రమంగా నెరవేర్చి, అక్కడ శాంతి భద్రతలు కాపాడగలిగినందుకు పొంగిపోతూ "ఇక రైలు బయల్దేరవొచ్చు" అన్నట్టుగా, దర్పంగా స్టేషను మాష్టరు ముఖంలోకి చూసి కళ్లెగరేసాడు పోలీసు కానిస్టేబులు.

ఆ తర్వాత మరికొద్దిసేపటికే గణగణ గంట కొట్టేడు, మస్తానయ్య. గార్డు పచ్చలైటు చూపించేడు.

రాకాసిలా పెడబొబ్బపెట్టి, పడమటి చీకట్లలోకి రైలు బయలుదేరింది.

(ఆంధ్రజ్యోతి సచిత్రవారపత్రిక. 1.7.1988)